## వైభవంగా బ్రహ్మోత్సవం



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం పుష్కర బ్రహోత్సవ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 7గంటలకు సేవా కాలం, తీర్థ గోష్ఠి, 9గంటలకు యాగశాల ప్రవేశం, ద్వారతోరణ పూజ, చతుస్థానార్చన అగ్ని ముఖం, నిత్య పూర్ణాహుతి, 11 గంటలకు ధ్వజారోహణం, నిత్యబలి, నివేదన, సాయంత్రం 5.30గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, దేవతాహ్వానం, భేరి పూజ, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్రహోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 'ఉప్పల్'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హబ్సిగూడ ఓయూ క్యాంపు కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని ఓయూ క్యాంప్‌–3లో ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఓయూ క్యాంపు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు బీవీ.చారి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## తైక్వాండోతో శారీరక ధృఢత్వం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: తైక్వాండోతో చిన్నారులకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ అర్కేపురం హనుమాన్ దేవాలయం హాలులో కేకే వారియర్స్ తైక్వాడంతో అకాడమీ ఆధ్వర్యంలో బెల్టుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై బెల్టులు ప్రధానం చేశారు. అనంతరం తైక్వాండో మాస్టర్ కళ్యాణ్‌ను సత్కరించారు.

## సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరిస్తా



సమావేశంలో పాల్గొన్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఏవి ఇన్ఫ్రా ప్రైడ్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

## నేరాల అదుపునకు సీసీ కెమెరాల దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: నేరాలు అదుపు చేయడానికి సీసీ కెమెరాలు దోహదపడతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్, నాగర్జుననగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కాలనీలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుకు కావాల్సిన సహకారం అందజేస్తానన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రామ్‌రెడ్డినగర్‌లో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, కాటేపల్లి రవీందర్‌రెడ్డి, నందకంటి శివ పాల్గొన్నారు.

## పిల్లల పార్కు ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలోని ఆరో వార్డు బ్రూక్‌బాండ్ గ్రౌండ్‌లో చిన్న పిల్లల పార్కును ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీంజగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరూపయోగంగా ఉన్న గ్రౌండ్‌లో చిన్న పిల్లల కోసం ఆట పరికరాలను ఏర్పాటు చేశామన్నారు.

# చిన్న చెరువుపై.. చిత్తశుద్ధి కరువు

పేరుకు చిన్న చెరువు.. కాలుష్యంలో మాత్రం ప్రమాదకర స్థాయికి చేరింది. చెరువా.. మురుగు కుంటా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వందలు, వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఈ దుర్గంధం కారణంగా సమీప బస్తీలు, కాలనీలవాసులకు కునుకు కరువైంది. ఏళ్లుగా ఇదే దుస్థితి ఉన్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల్లో చలనం కరువైంది. స్థానికులు ఎన్నిసార్లు వారికి మొరపెట్టుకున్నా ఆలకించేవారు లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని వేడుకుంటున్నారు. – రామంతాపూర్



చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిన చిన్న చెరువు

- పేరుకుపోతున్న మురుగు, వ్యర్థాలు
- ప్రమాదకర స్థాయికి చేరిన కాలుష్యం
- భారీగా మృత్యువాత పడుతున్న చేపలు
- నిర్లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీలవాసులు

ఒకప్పుడు ఆక్రమణలతో అల్లాడిన చిన్న చెరువు.. వ్యర్థాలతో నిండిపోయి ప్రస్తుతం కాలుష్యకాసారంగా మారుతోంది. పట్టించుకునే వారు లేక రోజురోజుకూ చెరువు ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. చెరువులో నీరు కాలుష్యంతో నిండిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. బస్తీలు, కాలనీల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా చిన్న చెరువును అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే కాలుష్యకాసారంగా మారిందని పర్యావరణ ప్రియులు ఆరోపిస్తున్నారు.



మృత్యువాత పడ్డ చేపలు

### వ్యర్థాలు డంప్ చేయడంతో..

చిన్న చెరువులో కొన్ని సంవత్సరాలుగా సమీప బస్తీల నుంచి డ్రైనేజీ నీరు భారీగా చెరువులోకి చేరడంతో పాటు కొంతమంది స్థానికులు తమ ఇంట్లో పేరుకుపోయిన చెత్తను మూటలు కట్టి చెరువులో వేయడం, జంతు వ్యార్థాలు, చికెన్ వ్యర్థాలను అందులోనే డంప్ చేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది.

### మురుగు నీరు చేరకుండా..

చెరువు పరిరక్షణకు జీహెచ్‌ఎంసీ సెక్యూరిటీ గార్డ్స్ కేవలం ఒకే చోట కూర్చోకుండా చెరువు మొత్తం కలియ తిరుగుతూ చెత్తా వ్యర్థాలు వేయకుండా అడ్డుకోవాలి. చెరువులో పేరుకుపోతున్న చెత్తను ఇతర వ్యక్తులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది రెండు రోజులకు ఒకసారి తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా తరచూ పేరుకుపోతున్న గుర్రపు డెక్కను 15 రోజులకోసారి తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువులోకి మురుగు నీరును రాకుండా దారి మళ్లించాలి. కాలుష్యంతో ప్రమాదకర స్థాయికి చేరుకున్న చిన్న చెరువును కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని పర్యావరణ ప్రియులు అంటున్నారు. ఇప్పటికైనా వారు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల మధ్య సమన్వయం లేక.. | చిన్న చెరువుపై చిన్న చూపు



చిన్న చెరువులో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. చేపలు మృత్యువాత పడి పైకి తేలుతున్నాయి. చెరువులో పూడికతీత పనులు చేపట్టాలని పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరితే.. ఇరిగేషన్ విభాగం పేరు చెబుతున్నారు. ఇరిగేషన్ వారిని అడిగితే జీహెచ్‌ఎంసీ వారి పేరు చెబుతున్నారు. శాఖల మధ్య సమన్వయం లేక పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. త్వరలో జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం.

– బండారు శ్రీవాణి వెంకటరావు, కార్పొరేటర్



ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న చెరువులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కాలుష్యం లేకుండా చర్యలు చేపడుతున్నారు. కానీ రామంతాపూర్ చిన్న చెరువులో కాలుష్యం లేకుండా చేయడంలో మాత్రం అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ఇటీవల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించినా అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. కాలుష్యం లేకుండా చెరువులో పూడికతీత చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతాం.

– ఎర్రం శ్రీనివాస్, సీపీఎం ఉప్పల్ సర్కిల్ సెక్రటరీ

## మహిళలు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

కుషాయిగూడ: మహిళలు ఉపాధి మార్గాలు ఎంచుకొని ఆర్థిక పరిపుష్టిని సాధించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీలో ఐనయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

## బీజేపీ అభ్యర్థి విజయానికి కృషిచేయాలి

అల్వాల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం అల్వాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. దేశంలో మరోసారి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ అధ్యక్షులు పి.హరీష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేష్, మాజీ ఎంపీ సి.సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## సందడి చేసిన చిన్నారులు



అల్వాల్: మచ్చబొల్లారం సంజీవరెడ్డి ఫంక్షన్‌హాలులో ఆదివారం పాపిలోన్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ, స్కూల్ ప్రిన్సిపల్ కరుణశ్రీ, ఉపాధ్యాయులు నవనీత, సరోజ, మానస, సుమలత, పద్మ, రజనీ, తల్లి దండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## శోభాయమానం.. మల్లికార్జునస్వామి కల్యాణం



అల్వాల్: అల్వాల్ పాకాలకుంట మల్లిఖార్జున స్వామి దేవాలయంలో స్వామివారి కళ్యాణం శోభాయమానంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, సాయంత్రం అగ్నిగుండాలు, గొలుసు తెంపుట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, టి.మల్లేష్ యాదవ్, నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టెక్నో ఫెస్టులు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయి

ఘట్‌కేసర్: టెక్నో ఫెస్టులు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయని, ఆవిష్కరణలకు మూలకారణమని మైక్రోసాఫ్ట్ సీనియర్ విశ్లేషకుడు మణికాంత్ అన్నారు. ఆదివారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో (ఏయూ)లో జాతీయ స్థాయి టెక్నో–కల్చరల్ ఫెస్ట్ దక్ష–3.0 ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అతిథి ఫిన్‌టెక్, ప్రాప్‌టెక్, హెల్త్‌టెక్ నిపుణులు హను యెద్లూరి మాట్లాడుతూ టెక్నో సదస్సులు విద్యార్థుల జ్ఞానాన్ని పెంచుతాయని, ప్రయత్నం విఫలం కావచ్చు కాని చివరకు విజయం సాధిస్తారన్నారు. సదస్సుకు భారతదేశంలోని 175 కళాశాలల నుండి 5 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి, డైరెక్టర్ శ్రీనివాస్, సదస్సు కన్వీనర్ రాజశేఖర్, కోకన్వీనర్లు రవీందర్‌రెడ్డి, స్వప్నగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏయూ టెక్నో సదస్సులో మాట్లాడుతున్న మణికాంత్

## ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం

జవహర్‌నగర్: ప్రజా ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి తాగునీరందిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని 28వ డివిజన్‌లో కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్‌లతో కలసి మిషన్‌భగీరథ మంచినీళ్ల కనెక్షన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్(జంగయ్య) యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఆరు గ్యారెంటీలను అమలు చేసి నిరుపేదల బతుకుల్లో చిరునవ్వు చూస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలను నమ్మొద్దని రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని సీట్లను కైవసం చేసుకుంటున్నారు. జవహర్‌నగర్‌ను అన్ని విధాల అభివృద్ధి పరిచే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు దయాకర్‌చారి, చంద్రశేఖర్, స్వామి, చెన్నారెడ్డి, రాజు, యాకచారి, 28వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.




జవహర్‌నగర్‌లో మంచినీళ్ల కనెక్షన్ ప్రారంభించిన తోటకూర వజ్రేష్ యాదవ్

## అంబేడ్కర్ ఒక వ్యక్తి కాదు శక్తి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఒక వ్యక్తి కాదు శక్తి అని మేడ్చల్ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల సమర్పణ కార్యక్రమానకి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ దేశంలోని సబ్బండ వర్గాల హక్కుల కోసం సాధన కోసం పేదలకు ఓటు అనే ఆయుధాన్ని అందజేశాడన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యాంగం ప్రతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేశ్‌గౌడ్, అరుణ్‌కుమార్, కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ పన్నులు చెల్లించాలని ప్రజలకు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌కు అభివృద్ధికి నిధులు విడుదల చేసినందుకు ఆదివారం మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీ కల్వర్టు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మల్లాపూర్ జంక్షన్ అభివృద్ధికి రూ.1.13 కోట్లు, ఎన్ఎఫ్‌సీ చౌరస్తా అభివృద్ధికి రూ.66 లక్షలు, గ్రీన్ హీల్స్ కాలనీ వద్ద కల్వర్టు కోరకు రూ.54 లక్షలు నిధులను కేటాయించారన్నారు.

## లయోలాలో ఇంటర్ కాలేజియేట్ పోటీలు



అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీలో ఆదివారం ఫాదర్ బాలయ్య మెమోరియల్ ఇంటర్ కాలేజియేట్ బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ పురుషుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండంట్ విజయ్‌కుమార్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో బాస్కెట్‌బాల్‌లో లయోలా అకాడమీ, వాలీబాల్‌లో నిజాం కళాశాల, ఫుట్ బాల్‌లో లయోలా అకాడమీ జట్లు విజేతలుగా నిలిచారు. విజేతలకు కమాండంట్ విజయ్‌కుమార్‌వర్మ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డిలు ట్రోఫీలు అందచేసి అభినందనలు తెలిపారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నటరాజ ఆర్ట్స్ అకాడమీ గురువు విజయ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. నందిని, పరిమళ, రక్షిత, అవంతిక, నిక్షిప్త, అగస్త్య ప్రదర్శించిన అన్నమాచార్య సంకీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ నర్సింహారావు

బోడుప్పల్: భారత దేశంలో ఆర్థిక సంస్కరణలకు పునాదులు వేసింది మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు అని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. బోడుప్పల్ అఖిల బ్రాహ్మణ వికాస సమితి భవనంలో ఆదివారం పీవీ నరిసింహారవు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరం, పీవీ నర్సింహారావుకు నివాళులు అర్పించే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి భారతీయులకు ఆర్థిక ఫలాలు అందించిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు. పీవీ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ ఎస్.వి. సుధాకిరణ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవలను గుర్తించి భారత రత్న ఇవ్వడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమంలో పీవీ ప్రభాకర్‌రావు, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, బోడుప్పల్ అఖిల బ్రాహ్మణ వికాస సమితి అధ్యక్షులు యేలూరి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



వాణిదేవికి మెమొంటోను అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

## మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 11వ డివిజన్‌లోని తిరుమల మెడోస్ కాలనీలో రూ 30లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్‌ల్లో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడిం చారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ కొత్త శ్రీవిద్యగౌడ్, మాజీ వైస్ ఎంపిపి కొత్త చక్రపాణిగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, స్వప్న, పాండురంగ, శేఖర్ రాజు, కుమార్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్

## దుమ్మురేగుతున్న ఉప్పల్ రోడ్డు



ఉప్పల్: ఉప్పల్ ప్రధాన రహదారి దుమ్మురేగుతోంది. నిత్యం ఇక్కడ ప్రజలు దుమ్ముతో నరక యాతన అనుభవిస్తున్నారు. ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు దాదాపుగా ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా మట్టికొట్టుకుపోయి గుంతలు పడి బీభత్సంగా మారింది. ఎండలు ముదురుతుండటంతోమట్టి రోడ్ల మీద దుమ్ము రేగుతూ వాహనాలు ముందుకు వెళుతుంటే వెనుక ప్రయాణించే వారికి ఇబ్బందిగా మారింది. ఇక ద్విచక్ర వాహాదారుల , కాలినడకన వెళ్లే వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. దీనికి తోడు ట్రాఫిక్ చుక్కలు చూపుతోంది. ఉప్పల్ నుంచి వరంగల్ వెళ్లడానికి, యాదాద్రికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యవాహనాలతో ఈ రహదారి బిజీగా ఉంటుంది. దీనికి తోడుగా శుభ కార్యాలయితే విఐపిల తాకిడితో ఈ దారి పూర్తిగా ట్రాఫిక్‌లో చిక్కుకుని విల విల లాడుతోంది. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా దాదాపుగా ఆరు సంవత్సరాలుగా ఈ రహదారి పరిస్థితి ఘోరంగా మారింది. కారిడార్ పనులు నత్తనడకన నడుస్తుండటంతో ఈ దారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. రోడ్లు వేసే వరకు ప్రత్యమ్నాయ చర్యగా కనీసం దుమ్ము రేగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు.